హరీశ్‌రావును కలిసిన మున్సిపల్ చైర్మన్



హరీశ్‌రావుకు స్వీట్‌బాక్స్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, నవంబర్ 2: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు బెండే మధు మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు చందు, మెట్టయ్య, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రెండుగంటలపాటు శ్రమదానం చేయాలి

హుస్నాబాద్‌లోని ప్రకృతివనంలో చెత్తను తొలిగిస్తున్న మున్సిపల్‌చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 2: పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ వారంలో రెండుగంటలు శ్రమదానం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత కోరారు. స్వచ్ఛదీవాళి, శుభదీవాళి కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 1వ వార్డుకు చెందిన ప్రకృతి వనంలోని చెత్తా చెదారాన్ని ఆమె తొలిగించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వనంలోని చెత్తాచెదారాన్ని ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణాన్ని స్వచ్ఛతలో ముందు నిలిపేందుకు ప్రజలు సహకరించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతోపాటు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలు మున్సిపల్‌తో కలిసిరావాలని ఆమె కోరారు. మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ కొంకట నళిని దేవి, కోఆప్షన్ సభ్యుడు అయూబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్ పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ సేవలు భేష్

గిర్మాపూర్‌లో ఉచితంగా స్పోర్ట్స్ యూనిఫామ్స్ అందజేస్తున్న పేరెంట్స్‌కమిటీ సభ్యులు

వర్గల్,నవంబర్ 2: పేరెంట్స్ కమిటీ సేవలు భేష్ అని మండల విద్యాధికారి సునీత అన్నారు. శనివారం మండలంలోని గిర్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 134 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన పేరెంట్స్ కమిటీ సభ్యులు సొంత ఖర్చులతో స్పోర్ట్స్ యునిఫామ్స్ అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక విద్య బలోపేతానికి ప్రభుత్వం కృషిచేస్తున్నదన్నారు. గ్రామంలో పేరెంట్స్ కమిటీ విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి ఆదర్శమన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎం కనకరాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి

కొమురవెల్లి, నవంబర్ 2: మండలంలోని రసూలాబాద్‌కు చెందిన ఏర్పుల కిష్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి పరామర్శించడంతో పాటు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. రసూలాబాద్ మాజీ సర్పంచ్ పచ్చిమండ్ల స్వామిగౌడ్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోను కలిసిన డాక్టర్ల బృందం

సిద్దిపేటలో డీఎంహెచ్‌వో పల్సన్‌కుమార్‌కు మొక్క అందజేస్తున్న డాక్టర్లు

జగదేవపూర్, నవంబర్2: సిద్దిపేట డీఎంహెచ్‌వోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పల్సన్‌కుమార్‌ని శనివారం సిద్దిపేటలో తెలంగాణ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, జగదేవపూర్ పీహెచ్‌సీ వైద్యుడు సత్య ప్రకాశ్ ఆధ్వర్యంలో డాక్టర్ల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్క అందజేసి శాలువాకప్పి సన్మానించారు. ఆసంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ రాధాకృష్ణ, కోశాధికారి రాజశేఖర్‌గౌడ్, జిల్లాకు చెందిన వైద్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 2 : డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పల్వన్‌కుమార్ శనివారం కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీలో ఓపీ వైద్యసేవలు, సాధారణ డెలివరీలు పెంచాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఆనంద్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ శ్రీకళ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, గజ్వేల్ డాక్టర్ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీ

గిరిజన కళాశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

హుస్నాబాద్/ హుస్నాబాద్‌రూరల్, నవంబర్ 2: హుస్నాబాద్ పట్టణంలోని గిరిజన బాలికల కళాశాల, మండలంలోని జిల్లెలగడ్డలోని గిరిజన ఆశ్రమ కళాశాలలను శనివారం జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి కే రవీందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని రిజిస్టర్లు, తరగతి గదులు, కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. దేశ భవిష్యత్ తరగతి గదిలో నిర్మించబడుతుందని, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేలా కృషిచేయాలని అధ్యాపకులకు సూచించారు.

జిల్లా స్థాయి నెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

ఉమ్మడి మెదక్ జిల్లా నెట్‌బాల్ క్రీడాకారులు

గజ్వేల్, నవంబర్ 2: ఉమ్మడి మెదక్ జిల్లా నెట్‌బాల్ క్రీడాకారులను శనివారం ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ అండర్19, 17, 14 విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేశారు. 250 మంది విద్యార్థులు ఎంపికలో పాల్గొనగా అందులో ప్రతిభావంతులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో కృష్ణ మాట్లాడారు. ఎస్ జీఎఫ్ సెక్రటరీలు సౌందర్య, సమ్మయ్య, భవానీ, పీఈటీలు విజయరేఖ, రంజిత్, రవికుమార్, నగేశ్, భాను, ప్రశాంత్, ఆంజనేయులు, మురళికృష్ణ పాల్గొన్నారు.

నేడు సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

మిరుదొడ్డి, నవంబర్ 2 : ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్లను ఎంపిక చేయడం జరుగుతుందని ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీటీసీ (మిరుదొడ్డి-1) బైరయ్య, ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ రమణ శనివారం సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ బీహెచ్ ఈఎల్ ఓల్డ్ ఎంఐజీలో క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు మూడు పాస్‌ఫోటోలతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని మధ్యాహ్నం మూడుగంటల వరకు గ్రౌండ్‌కు చేరుకొని రిపోర్టు చేయాలని సూచించారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8నుంచి 10వ తేదీ వరకు హనుమకొండలో జరుగనున్న తెలంగాణ రాష్ట్ర సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్: 9704746511, 9440703038 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

రిమ్మనగూడలో రైతులతో కలిసి మాట్లాడుతున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబర్ 2: ప్రభుత్వం వెంటనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు లను ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రిమ్మనగూడలో పత్తి పంటను ఆయన పరిశీలించి రైతులు, కూలీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు దళారులకు పత్తి అమ్ముకోవడంతో క్వింటాల్‌కు రూ.5500 నుంచి రూ.6500 మాత్రమే చెల్లిస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దళారులతో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కు కావడంతోనే నేటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదన్నారు. దళారులు, ప్రభుత్వం మధ్య రైతులు నష్టపోతున్నారని, కొనుగోలు కేంద్రాల్లో రూ.7500 చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధరకు అదనంగా రూ. 1000 చెల్లించి కొనుగోలు చేశారన్నారు. కానీ ప్రస్తుతం దళారులు తక్కువ ధర చెల్లిస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా మోసపోతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్దతు ధర చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక వర్షాల కారణంగా 15 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి ఆరేడు క్వింటాళ్లు మాత్రమే వచ్చే పరిస్థితి ఉందని, రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టం అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా, పంట రుణమాఫీ పూర్తిసాయిలో అమలుచేయకరైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, రైతులు నర్సయ్య, బాలమల్లు, ఎల్లం, వినయ్ పాల్గొన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పనులు పూర్తిచేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్,డీఆర్డీవో

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్2: మార్చి 2025 నాటికి నరేగా కింద మంజూరు చేసిన గ్రామీణ ఉపాధి హామీ పనులను పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ రాష్ట్ర సచివాలయం నుంచి నరేగా పనులు, ఇందిరా మహిళాశక్తి, రోడ్డు నిర్మాణ పనులపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు,అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లోని గ్రామీణ ఉపాధి హామీ కింద మంజూరైన పనులు త్వరగా పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు,ఇంకుడు గుంతల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన కోసం మంజూరు చేసిన నిధులను మార్చి 2025లోపు ఖర్చు చేయాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు ఇందిరా మహిళాశక్తి కింద ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తుందన్నారు. గ్రామాల్లో అవసరమైన చోట చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీవో, అధికారులు పాల్గొన్నారు.

పటిష్ట చర్యలు తీసుకోవాలి

వరిధాన్యం కొనుగోలుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాలశాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వానకాలం సీజన్ 2024-25కు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియపై హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్,ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు జరిగేలా అన్ని జిల్లాల కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. సన్నరకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్‌కు 500 బోనస్ ప్రకటించిందన్నారు. అనంతరం సమగ్ర ఇంటింటి సర్వేపై రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్ని జిల్లాల అధికారులతో సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్వో నాగరాజమ్మ, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు చంద్రకళ,రామ్మూర్తి, చీఫ్ ప్లానింగ్ అధికారి దశరథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారు: ఎమ్మార్పీఎస్

సిద్దిపేట టౌన్,నవంబర్ 2 : ఎస్సీ వర్గీకరణను మొట్టమొదటి సారి రాష్ట్రంలో అమలు పరుస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని ఎమ్మార్పీఎస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి లింగపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. రేవంత్ సర్కార్ తీరును నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నేతలు శనివారం మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దేశంలోనే మొదట తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని నమ్మించి వర్గీకరరణ అమలు చేయకుండానే ఉద్యోగ నియామకాలు చేపడుతున్నారన్నారు.దీన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రాష్ట్ర వ్యాపంగా పర్యటనకు శ్రీకారం చూట్టారన్నారు.ఆదివారం సిద్దిపేటలో జరిగే సమావేశానికి మందకృష్ణ హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో యాదగిరి,ప్రకాశ్, రమేశ్, రాజు, రాకేశ్,రజనీర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మద్దూరు కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో రామకృష్ణ

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్2: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మద్దూరు మండల వ్యవసాయాధికారి బూరెల రామకృష్ణ కోరారు. శనివారం మద్దూరు మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్దూరు మండలంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏడు, ఐకేపీ ఆధ్వర్యంలో ఆరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏఈవో రాజు, సీసీ ప్రేమలత, ఐకేపీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 2 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.

కోనాయిపల్లిలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ

కోనాయిపల్లిలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

నంగునూరు, నవంబర్ 2 : మండలంలోని కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి పోటీ చేసేందుకు సిద్ధమైన ఆయన శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. గత ఎన్నికల్లో పీఆర్టీయూ టీఎస్ అధికారిక అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన రఘోత్తంరెడ్డి మరోసారి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సారి పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థిగా వంగ మహేందర్‌రెడ్డిని అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

మల్లన్నకు విశేష పూజలు

చేర్యాల, నవంబర్ 2: కార్తిక మాసం ఆరంభాన్ని పురస్కరించుకొని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం మల్లన్నకు ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించి లలితా సహస్రనామ పారాయణం, సువాసినీల చేతదీపారాధన చేయించారు. అనంతరం స్వామివారికి మహా మంగళహారతి, మహా మంత్ర పుష్ప సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న సువాసినీలకు అమ్మవారి ప్రసాదంగా తాంబూలము అందజేశారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు, ఆగమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుకు వివరాలివ్వాలి

హుస్నాబాద్, నవంబర్ 2: ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్(అభా) హెల్త్ కార్డుకు డివిజన్‌లోని ప్రజలందరూ వివరాలివ్వాలని హుస్నాబాద్ సీహెచ్‌సీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈకార్డును ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని, 14 అంకెలు గల ఈ గుర్తింపు కార్డులో ప్రజల పూర్తి ఆరోగ్య సమాచారం ఉంటుందన్నారు. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన ద్వారా సుల భంగా రూ. 5లక్షల వరకు ఆరోగ్య బీమా పొందే సదుపాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్డును ప్రజలు ఆన్‌లైన్ ద్వారా లేదా గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తల ద్వారా ఉచితంగా పొందవచ్చన్నారు. హెల్త్ సిబ్బందికి ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ ఇచ్చి సహకరించాలని ఆయన కోరారు.

సాత్విక ఆహారంతోనే శారీరక ఆరోగ్యం

పలు పాఠశాలలకు పౌష్టికాహారం అందజేస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, నవంబర్ 2 : సాత్విక ఆహారంతోనే శారీరక ఆరోగ్యం లభిస్తుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వెల్కటూర్‌లోని గోకులాశ్రమం శ్రీ వశిష్టపరంపర ఆధ్యాత్మిక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారానికి ఒక పాఠశాల చొప్పున పౌష్టికాహార పంపిణీలో డీఈవోపాటు ఎంఈవోలు రాజా ప్రభాకర్, దేశిరెడ్డి, శ్రీవిశిష్టపరంపర ఆధ్యాత్మిక ట్రస్ట్ నిర్వాహకులు మధుసూదనాచార్యులు, మాతా సరళాదేవి పాల్గొన్నారు. నంగునూరు మండలంలోని మగ్ధుంపూర్ హైస్కూల్, ప్రైమరీ స్కూల్, ముండ్రాయి ప్రైమరీ స్కూల్, సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ హైస్కూల్, ప్రైమరీ స్కూల్, బక్రిచెప్యాలలోని పాఠశాలలకు పౌష్టికాహారం అందించనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగామాట్లాడుతూ.. ఉదయం ఎంతోమంది పేద విద్యార్థులు ఖాళీ కడుపుతో వస్తుంటారని.. దీని వల్ల విద్యార్థులు సరిగ్గా చదువుకోలేక పోతున్నారన్నారు. ఉదయం పౌష్టికాహారం అందించడం ద్వారా విద్యార్థులందరూ శ్రద్ధగా చదువుకుంటారని తెలిపారు. ఇప్పటికే ట్రస్ట్ ద్వారా పలు పాఠశాలల్లో పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశామన్నారు.

యాదాద్రి ఆలయంలో సిద్దిపేట చిన్నారుల శాస్త్రీయ నృత్యం

సిద్దిపేట అర్బన్, నవంబర్ 2 : సిద్దిపేట పట్టణానికి చెందిన శ్రీ భవానీ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో యాదాద్రి నారసింహుడి క్షేత్రంలో శనివారం సిద్దిపేటకు చెందిన చిన్నారులు చేసిన శాస్త్రీయ నృత్య రూపాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పేరణీ నృత్యం, ఆంధ్రనాట్యంతో నృత్య కళాభిమానులను అలరించారు. ముఖ్యంగా బేబి వైష్ణవి ప్రదర్శించిన "హైగిరి నందిని.. నందిత మోదిని" నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకున్నది. నృత్యం మహోత్సవంలో పేరిణీ, ఆంధ్రనాట్యం, కూచిపూడి, భరతనాట్యం వంటి కళారీతులను చిన్నారులు ప్రదర్శించారు. అనంతరం కళాప్రదర్శన చేసిన చిన్నారులను దేవస్థానం తరపున సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

పిల్లలు,మహిళల రక్షణకు ప్రాధాన్యమివ్వాలి

సిద్దిపేట కలెక్టరేట్,నవంబర్ 2: పిల్లలు, మహిళల రక్షణకు ప్రాధాన్యమివ్వాలని సిద్దిపేట సీపీ అనురాధ అధికారులకు సూచించారు.శనివారం సిద్దిపేట సీపీ కార్యాలయంలో షీ టీమ్ నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. సహాయం కోసం వచ్చే మహిళలు, పిల్లల పట్ల షీ టీమ్ సిబ్బంది గౌప్యత పాటించాలన్నారు. వారానికి ఒకసారి షీ టీమ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సంబంధిత ఏసీపీలు మానిటర్ చేయాలన్నారు. స్కూల్‌కు వచ్చే అమ్మాయిల ప్రవర్తనలో ఏదైనా మార్పు కనిపిస్తే వెంటనే సంబంధిత షీ టీమ్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. కోమటిచెరువు, పాండవుల చెరువు, ఆక్సిజన్ పార్కు, అర్బన్ పార్కు, బస్టాండ్లు, స్కూల్, కాలేజీల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మైనర్ అబ్బాయిలు,అమ్మాయిలు కనిపిస్తే కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. సమావేశంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సీసీ నితిన్ రెడ్డి, మూడు డివిజన్ల షీ టీమ్ సిబ్బంది, సిద్దిపేట భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీకొని మహిళ మృతి

గజ్వేల్, నవంబర్ 2: కారును మరో కారు ఢీకొనడంతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని రిమ్మనగూడ రాజీవ్ రహదారిపై శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్‌కు చెందిన మహమ్మద్ జమీలరాజా భర్త మహమ్మద్ రాజాతో కలిసి సిద్దిపేటకు వెళ్లి తిరిగి సికింద్రాబాద్‌కు కారులో వెళ్తున్నారు. రిమ్మనగూడలోని హోటల్ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి కారు బలంగా ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న మహమ్మద్ జమీల రాజా, మహమ్మద్ రాజాలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం గజ్వేల్ దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు మహమ్మద్ జమీల రాజా(65) మృతి చెందినట్లు తెలిపారు. ఆమె భర్త మహమ్మద్ రాజాకు గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పోతారంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలకిషన్

బెజ్జంకి, నవంబర్ 2: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పుట్ట సంపత్ తండ్రి నర్సయ్య, చీలాపూర్ గ్రామానికి చెందిన పరకాల పోచయ్య ఇటీవల మరణించారు. మృతుల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శనివారం పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, దుంబాల రాజమహేందర్‌రెడ్డి, రావుల మొండయ్య, పవ్వాడి మల్లిఖార్జున్, పంతం శ్రీనివాస్, ఎర్రవెల్లి శ్రీనివాస్, లింగాల తిరుపతి, స్వరూప, తార, బాలయ్య, తిరుపతి, శ్రీనివాస్, నారాయణ ఉన్నారు.

ఈపీఎఫ్ కార్యాలయాన్ని యథావిధిగా కొనసాగించాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట,నవంబర్